

# తెలంగాణను ఎండబెట్టి..
# గోదారిని కొల్లగొట్టే!

మొదటిపేజీ తరువాయి...

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలోనే మోదీ ప్రభుత్వం గోదావరిపై ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మాణంతో తమిళనాడులోని కావేరికి గోదావరి జలాలను తన్నుకుపోయే గోదావరి-కావేరీ అనుసంధాన ప్రాజెక్టును తెరపైకి తెచ్చింది. దీని ద్వారా పార్లమెంటు ఎన్నికల్లో తమిళనాట రాజకీయ లబ్ధి పొందాలనుకున్నా.. కుట్రపై బీఆర్ఎస్ ఒక్కసారిగా ధిక్కార స్వరం వినిపించడంతో తెలంగాణలో ఓట్లకు గండిపడుతుందన్న భయంతో అనివార్యంగా వెనక్కి తగ్గింది. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు సర్కారు వచ్చిందే తడవుగా మళ్లీ ఈ కుట్రకు ఉమ్మడిగా సాన బెట్టారు. అందులో భాగంగానే అధికారంలోకి వచ్చిన వెంటనే ఏటా సముద్రంలోకి 4 వేల టీఎంసీల గోదావరి జలాలు పోతున్నాయంటూ చంద్రబాబు కొత్త పల్లవి అందుకున్నారు. ఆ తర్వాతే పోలవరం నుంచి రాయలసీమకు గోదావరి జలాలను తరలించేందుకు గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును చేపడుతున్నట్టు ప్రకటించారు. ఇదే క్రమంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సైతం గోదావరి-కావేరీ అనుసంధాన ప్రాజెక్టు డిజైన్‌ను మార్చుకుంది. తెలంగాణ సమ్మతితో సంబంధం లేకుండానే దిగువన పోలవరం నుంచి కావేరీకి గోదావరి జలాలను తన్నుకుపోవాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ మేరకు చంద్రబాబు చేపట్టే గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును ముందుకు తీసుకుపోతే తమిళనాడుకు గోదావరి జలాల తరలింపునకు కూడా మార్గం సుగమమైనట్టే! అందుకే తాజాగా గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు రూ.3 వేల కోట్లు ఇచ్చేందుకు ప్రధాని మోదీ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్టు తెలిసింది. ఇక బాబు ప్రాజెక్టు పట్టాలెక్కితే నాగార్జునసాగర్ కుడి కాల్వతో పాటు రాయలసీమలోని పెన్నా బేసిన్‌కు కూడా గోదారమ్మ పరుగులు పెడుతుంది. పనిలో పనిగా జలాలను కావేరికి అనుసంధానం పేరిట తమిళనాడుకు తరలించనున్నారు. ఎగువన కేసీఆర్ నిర్మించిన మేడిగడ్డ బరాజ్‌ను కాలగర్భంలో కలిపితే ఎలాంటి అడ్డూ లేకుండా ఏడాది పొడవునా దిగువన పోలవరం వద్ద గోదావరి జలాల లభ్యత ఉంటుంది. అందుకే ఏడాదిన్నరగా రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 'కుక్కను చంపేముందు పిచ్చికుక్క అనే ముద్ర వేయాలి' అన్నట్టు కాళేశ్వరం ప్రాజెక్టుపై కోడిగుడ్డు మీద ఈకలు పీకే వైఖరిని ప్రదర్శిస్తున్నది. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపివేయాలనే రేవంత్ సంకల్పం దీని ద్వారా ఎంతవరకు నెరవేరుతుందో దేవుడెరుగు! కానీ కాళేశ్వరం ప్రాజెక్టును నమ్ముకొని ఉన్న 11 తెలంగాణ జిల్లాల్లో లక్షలాది ఎకరాలు మళ్లీ ఉమ్మడి రాష్ట్రంలో పడ్డట్టు పడావుగా మారుతాయనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతున్నది. మరో కీలక విషయం ఏమిటంటే చంద్రబాబు చేపట్టే గోదావరి-బనకచర్లకు, కేంద్రంలోని మోదీ సర్కారు ఉవ్విళ్లూరుతున్న కావేరీ అనుసంధాన ప్రాజెక్టుకు ప్రాణహిత జలాలే ఆధారం! ఆ జలాలను ఒడిసిపడుతున్నదే కాళేశ్వరంలోని మేడిగడ్డ బరాజ్! ఇది ఉంటే మాకు నీళ్లు కావాలని తెలంగాణ పట్టుబడతది. ఆ బరాజ్ అనేదే లేకపోతే 'ప్రాణహిత జలాలు ఎట్ల వాడుకుంటరు? సముద్రంలోకి వృథాగా పోతున్న నీటిని తరలించుకుపోతే మీకేంది' అని ఇటు బాబు, అటు మోదీ ఎదురు ప్రశ్నిస్తరు.

### ఊపిరి పీల్చేలోపే గొంతు పిసికే కుట్ర

> తెలంగాణ కాస్త ఊపిరి పీల్చుకుంటున్నదనే సమయానికి మొత్తానికే గొంతు పిసికే కుట్రల కత్తులు విచ్చుకోవడం పరిపాటిగా మారింది. నిజాం నుంచి బయటపడి స్వతంత్ర రాష్ట్రంగా వెలుగొందిన కొన్నాళ్లకే ఆంధ్రప్రదేశ్‌తో కలవాల్సి వచ్చింది. ఆపై దాదాపు ఆరు దశాబ్దాల పాటు ప్రధానంగా జల వనరుల్లో జరిగిన అన్యాయం అంతా ఇంతా కాదు. ముఖ్యంగా కృష్ణాలో ఒక తరహా అన్యాయం జరిగితే.. గోదావరిలో మరో తరహా అన్యాయం జరిగింది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన శ్రీరాంసాగర్, కడెం, ఎల్లంపల్లి, మిడ్‌మానేరు.. ఇలా ఏవి తీసుకున్నా ప్రధాన గోదావరిపైనే ఉన్నాయి. ప్రాణహితపై చేపట్టిన ప్రాణహిత-చేవెళ్లను నీటి లభ్యత లేని చోట ప్రతిపాదించారు. ఇంద్రావతి కలిసిన తర్వాత చేపట్టిన దేవాదుల ప్రాజెక్టులో కనీసం చిన్న బరాజ్ కట్టకుండా ఒక గుంతలో (ఇన్‌టేక్ పాయింట్) మోటర్ల ద్వారా లిఫ్టు చేయాలన్నరు. అంటే దిగువన ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి ఎలాంటి అడ్డూ లేకుండా గోదావరి జలాలు పారాలనేది అప్పటి పాలకుల ఉద్దేశం. కానీ తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం ఈ అన్యాయాన్నే సరిచేసింది. ప్రాణహిత మీద కాళేశ్వరం ప్రాజెక్టుకు, మేడిగడ్డ బరాజ్‌కు రూపకల్పన చేసింది. దిగువన ఇంద్రావతి జలాలను సైతం వాడుకునేందుకు దేవాదుల వద్ద తుపాకులగూడెం బరాజ్ (సమ్మక్క సారక్క)ను నిర్మించింది. కేసీఆర్ పదేండ్ల హయాంలో పొరుగున ఏపీలోని చంద్రబాబు, జగన్ ప్రభుత్వాలైనా! ఎగువన మోదీ సర్కారైనా! తెలంగాణ జల వనరులపై కన్నేసేందుకు సాహసించలేదు. ముఖ్యంగా తమిళనాడులో రాజకీయ లబ్ధి పొందేందుకు అక్కడికి గోదావరి జలాలను తరలించుకుపోవాలని బీజేపీ ఒక ఎజెండాగా పెట్టుకున్నది. కేంద్రంలో అధికారంలో ఉన్న ఆ పార్టీ ఏండ్ల తరబడి తండ్లాడినా కేసీఆర్ ప్రభుత్వం ఆ పాచిక పారనివ్వలేదు. ఎప్పుడైతే తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిందో గోదావరి-కావేరీ అనుసంధాన ప్రాజెక్టుపై బీజేపీ ప్రభుత్వం దూకుడు పెంచింది. ఇక పొరుగున చంద్రబాబు సర్కారు రెండోసారి కొలువుదీరిన తర్వాత ఆ ప్రయత్నాలను మరింత ముమ్మరం చేసింది. వెతికే తీగ కాలికి తగిలినట్టుగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా కేసీఆర్ మీద కోపంతో తెలంగాణ రైతాంగం నోట్లో మట్టి కొట్టేందుకూ వెనుకాడటం లేదు. దీంతో ఏడాదిన్నరగా ఈ మూడువైపుల నుంచి గోదావరి జలాల్లో మరోసారి తెలంగాణకు తీరని అన్యాయం చేసే పథక రచన ఒక్కో దశను దాటుకుంటూ ముందుకుపోతున్నది.

### సముద్రంలోకి 4 వేల టీఎంసీల వృథా ఓ బూచి!

> 'ఏటా సముద్రంలోకి 4 వేల టీఎంసీల గోదావరి జలాలు వృథాగా పోతున్నాయి. ఆ జలాలను వినియోగించేందుకే పోలవరం నుంచి సాగర్ మీదుగా బనకచర్లకు గోదావరి జలాలను తరలించే గోదావరి-కృష్ణా-పెన్నా అనుసంధాన ప్రాజెక్టు చేపడుతున్నం' అని కొన్ని నెలల కిందట ఏపీ సీఎం చంద్రబాబు ప్రకటించారు. కానీ సాంకేతికంగా చూస్తే ఇదంతా ఓ బూచి అని స్పష్టమవుతున్నది.

గోదావరి నుంచి ఏటా సముద్రంలో కలిసే 4 వేల టీఎంసీల్లో కేవలం ఒకట్రెండు నెలల్లోనే 80 శాతానికి పైగా వరద ఉంటుంది. అంటే గోదావరిలో వరద అనేది కొన్నిరోజుల పాటు ఉవ్వెత్తున వస్తుంది. మిగిలిన 8-10 నెలల పాటు మోస్తరుగానే ఉంటుంది. పైగా వరద భారీగా ఉన్నప్పుడు ఇతర ప్రాజెక్టులకూ వరద ఉండటంతో పాటు వర్షాలు పడి తాగు, సాగు నీటి వినియోగానికి ఈ జలాల అవసరం ఉండదు. అందుకే వర్షాకాలం పంటలకు కాకుండా యాసంగికి సాగునీరు అనేది అత్యంత కీలకమైనది. మేడిగడ్డ వద్ద దాదాపు ఏడాది పొడవునా ఇన్‌ఫ్లోలు ఉంటున్నందునే కేసీఆర్ కాళేశ్వరంలో భాగంగా మేడిగడ్డ బరాజ్‌ను అక్కడ నిర్మించారు. తద్వారా వర్షాకాలం ముగిసి భారీ వరదలు తగ్గగానే కాళేశ్వరం ద్వారా జలాలను ఎత్తిపోసుకుని యాసంగికి కూడా పుష్కలమైన సాగునీరు ఇచ్చారు. మరి మేడిగడ్డ పునరుద్ధరణ జరిగి అందులో నీటిని నిల్వ చేసి ఎత్తిపోసుకుంటే సంవత్సరంలో దాదాపు ఏడెనిమిది నెలలు ప్రాణహిత నుంచి దిగువకు గోదావరి జలాల ప్రవాహం చాలా తగ్గుతుంది. దీంతో పోలవరం నుంచి అదనంగా బనకచర్లకు గాని తమిళనాడులోని కావేరికి గాని గోదావరి జలాలను తరలించేందుకు నీటి లభ్యత ఉండదు. అందుకే మేడిగడ్డ బరాజ్ అడ్డు తొలగితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాదిరిగా ప్రాణహిత జలాలు నేరుగా దిగువన పోలవరం వైపు పోతాయి.

## చంద్రబాబు రూపంలో బీజేపీకి అస్త్రం

> పార్లమెంటు ఎన్నికల ముందు తమిళనాడుకు గోదావరి జలాలను తరలించేందుకు కేంద్ర ప్రభుత్వం చాలా ప్రయత్నాలు చేసింది. గోదావరి-కావేరీ ప్రాజెక్టు డీపీఆర్‌ను రూపొందించి రెండు రాష్ట్రాలకు పంపింది. మేడిగడ్డ-తుపాకుల గూడెం మధ్య ఇచ్చంపల్లి దగ్గర బరాజ్ నిర్మించి గోదావరి జలాలను తమిళనాడుకు తరలించుకుపోతామని, నెల రోజుల్లోనే సమాధానమివ్వాలని లేకపోతే అంగీకరించినట్టుగానే (డీమ్డ్‌టు యాక్సెప్ట్) పరిగణిస్తామంటూ మెడ మీద కత్తి పెట్టింది.

**రేవంత్‌రెడ్డి** ప్రభుత్వం దీనిపై నోరు మెదపలేదు. కానీ బీఆర్ఎస్ అప్పట్లో కేంద్రంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. అసలు గోదావరిలో మిగులుజలాలు ఉన్నాయా? లేవా? ఇవేవీ తేల్చకుండా ఎలాంటి శాస్త్రీయ అధ్యయనం చేపట్టకుండా ఏకపక్షంగా ప్రాజెక్టును ఎలా చేపడుతారంటూ గళం విప్పింది. అసలే పార్లమెంటు ఎన్నికలు కావడంతో తమిళనాడులో రాజకీయ ప్రయోజనం దేవుడెరుగు.. తెలంగాణలో నష్టం వాటిల్లుతున్నదనే భయంతో కేంద్రం వెనక్కి తగ్గింది. అయితే పార్లమెంటు ఎన్నికల తర్వాత అదే సమయంలో ఏపీలో అసెంబ్లీ ఎన్నికలు జరిగి చంద్రబాబు అధికారంలోకి రావడంతో బీజేపీకి అస్త్రం దొరికినట్టయింది. తాజాగా చంద్రబాబు రూపంలో గోదావరి-కావేరీ అనుసంధాన ప్రాజెక్టును మరో రూపంలో చేపట్టేందుకు పథకం రచించింది.

### గుట్టుగా తెలంగాణకు ద్రోహం

> 'రోగి కోరింది అదే.. వైద్యుడు ఇచ్చింది అదే' అన్నట్టు అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి మేడిగడ్డను పునరుద్ధరించే ఉద్దేశం లేదు. మేడిగడ్డ అడ్డుగా ఉంటే దిగువన పోలవరం నుంచి కావేరికి గోదావరి జలాలను తరలించడం కష్టం! దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏది కోరుకున్నదో కేంద్రంలోని బీజేపీకీ అదే కావాల్సి వచ్చింది.

తెలంగాణ గడ్డపై ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మించి తమిళనాడుకు గోదావరి జలాలను తరలిస్తే అనేక సమస్యలున్నట్టు తెలిసింది. మేడిగడ్డ-తుపాకులగూడెం బరాజ్‌ల మధ్య మరో బరాజ్ నిర్మించడం సాంకేతికంగా సవాల్ లాంటిదని నిపుణులు చెప్తున్నారు. మరోవైపు మేడిగడ్డను కాలగర్భంలో కలిపి సమీపంలోనే ఇంకో బరాజ్‌కు సహకరించడం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఇరకాటంగా మారుతుంది. పైగా తెలంగాణ గడ్డ మీద నుంచి గోదావరి జలాలను తరలించుకుపోతుంటే ఎలా ఊరుకుంటారు? అని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్, ప్రజల నుంచి ఒత్తిడి వస్తుంది. అందుకే మేడిగడ్డను పునరుద్ధరించకపోవడం వరకు బాధ్యతను నెరవేరిస్తే దిగువకు గోదావరి జలాలు పోయిన తర్వాత ఆంధ్రప్రదేశ్ పరిధిలో నుంచి వాటిని తన్నుకుపోవాలని కేంద్రం స్కెచ్ వేసింది. దీనికి తోడు చంద్రబాబు పనిలో పనిగా ఇందులో తన ప్రయోజనాన్ని కూడా చూసుకున్నారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు ద్వారా కృష్ణా, పెన్నా బేసిన్లకు గోదావరి జలాలను తరలించుకుపోవచ్చు. ఆపై కేంద్రం పెన్నా బేసిన్ నుంచి నేరుగా తమిళనాడులోని కావేరికి గోదావరిని తన్నుకుపోతుంది.

### చకచకా కదులుతున్న లింకులు..

ఏపీలో చంద్రబాబు మళ్లీ అధికారంలోకి రాగానే గోదావరి బనకచర్ల లింక్ ప్రాజెక్టును శరవేగంగా ముందుకు తీసుకురావడం ఈ పథకంలో భాగంగానే అర్థమవుతున్నది. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులతో పాటు కృష్ణాజలాల న్యాయమైన వాటాను దాదాపు పుష్కర కాలం పాటు సాగదీస్తున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చంద్రబాబు తెరపైకి తెచ్చిన గోదావరి-కృష్ణా-పెన్నా అంతర్రాష్ట్ర రివర్ లింక్ ప్రాజెక్టును మాత్రం వేగంగా ముందుకు తీసుకుపోతున్నది. గోదావరి నుంచి రోజుకు 2 టీఎంసీల చొప్పున 200 టీఎంసీలను పోలవరం నుంచి బనకచర్ల మీదుగా పెన్నా బేసిన్‌కు తరలించేందుకు ఈ ప్రాజెక్టుకు రూ.80 వేల కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఈ మేరకు చంద్రబాబు ప్రభుత్వం జలహారతి పేరిట స్పెషల్ పర్పస్ వెహికిల్ కార్పొరేషన్‌ను కూడా ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ప్రాజెక్టుకు కేంద్రం నిధులు ఇవ్వాలని చంద్రబాబు మీడియా సమావేశంలోనే కోరారు. అనంతరం చంద్రబాబు స్వయంగా కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు నిరుడు నవంబర్ 26న వినతిపత్రం కూడా ఇచ్చారు. దీంతో కేంద్రం ఈ ప్రాజెక్టుపై అధ్యయనానికి చర్యలు చేపట్టింది. కేంద్ర జలశక్తి శాఖ ఆదేశాల మేరకు కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డులు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)కి లేఖలు రాసింది. చంద్రబాబు ప్రతిపాదించిన ప్రాజెక్టుపై తదుపరి చర్యలు చేపట్టాలని అందులో ఆదేశించింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుకు రూ.3 వేల కోట్లు సమకూర్చేందుకు ప్రధాని మోదీ సైతం సూత్రప్రాయంగా అంగీకరించినట్టు సమాచారం. ఇందుకుగాను ప్రాజెక్టుకు ఆమోదం కూడా తెలిపేందుకు రంగం సిద్ధమవుతున్నట్టు తెలుస్తున్నది. త్వరలోనే దీనిపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు ఇరిగేషన్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ప్రధాని సూత్రప్రాయ అంగీకారంతో ప్రాజెక్టు పనులను ఈ ఏడాదే పట్టాలు ఎక్కించేందుకు ఏపీ సర్కారు సిద్ధమవుతున్నట్టు ఇరిగేషన్ వర్గాల్లో జోరుగా చర్చ కొనసాగుతున్నది.

## వెదిరె శ్రీరాంతో మంత్రాంగం

> తెలంగాణపై జరుగుతున్న ఈ కుట్రలో కాంగ్రెస్ ప్రభుత్వం మౌనంగా ఉండి పరోక్షంగా సహకారం అందిస్తుండటం గమనార్హం. ఈ నేపథ్యంలో తెలంగాణకు చెందిన వ్యక్తి కూడా ఇందుకు అంతర్గతంగా మంతనాలు చేస్తుండటం మరో విషాదం.

**కేంద్ర జల శక్తిశాఖ** మాజీ సలహాదారుగా, ఎన్‌డబ్ల్యూడీఏ రివర్ లింక్ ప్రాజెక్టుల టాస్క్ ఫోర్స్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించిన వెదిరె శ్రీరాం ఏడాదిన్నరలో పలుమార్లు సీఎం రేవంత్‌రెడ్డిని నేరుగా కలవడం వెనక ప్రధాన కారణం ఇదేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆ క్రమంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టును కొనియాడిన వెదిరె శ్రీరాం ఆ తర్వాత ప్రత్యేకంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ల ద్వారా కాళేశ్వరం మీద బురద జల్లే ప్రయత్నం చేశారు. ఆయన పదే పదే సీఎం రేవంత్‌రెడ్డిని సెక్రటేరియట్, కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కలుస్తూ రహస్యంగా ఈ అంశంపై సంప్రదింపులు సాగిస్తున్నారనే సమాచారం ఉన్నది. తాజాగా ఎన్డీఎస్ఏ నివేదిక సమర్పించిన అనంతరం కూడా సీఎం, వెదిరె భేటీ కావడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నది.



## పథకం ప్రకారమే కాళేశ్వరంపై దాడి

> సాగునీటి ప్రాజెక్టుల్లో లోపాలు తలెత్తడం సహజం. పొరుగున ఉన్న ఏపీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కడుతున్న పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రం వాల్ కొట్టుకుపోయింది. అది కేంద్ర జల సంఘమే డిజైన్ చేసింది. అయినా ఆ అవాంతరాలను తొలగించుకొని ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకుపోతున్నారు. కాళేశ్వరంలో ఒక చిన్న భాగమైన మేడిగడ్డ బరాజ్‌లో కేవలం ఒకే ఒక్క పిల్లర్ కుంగిపోయింది. దానిని సరిచేసుకొని ప్రాణహిత జలాలను ఎత్తిపోసుకోవచ్చు.

**పునరుద్ధరణ** జరిగే వరకు కూడా నీటిని ఎత్తిపోసుకునేందుకు ప్రత్యామ్నాయ సాంకేతిక విధానాలు ఎన్నో అందుబాటులో ఉన్నాయి. కానీ మేడిగడ్డ బరాజ్ నుంచి నీటిని ఎత్తిపోస్తే అందులో రైతులకు కేసీఆర్ కనిపిస్తాడనే భయమో? తెలంగాణలో అసలు ప్రాణహిత జలాలకు అడ్డుగా ఏ ఒక్క నిర్మాణం కూడా ఉండొద్దనే సంకల్పమో? గాని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే రెండు సీజన్లు మేడిగడ్డను ఎండబెట్టింది. యాసంగిలో పంటలు ఎండినా పట్టించుకోకుండా ఏడాదిన్నర నుంచి రాజకీయంగా వాడుకునేందుకే ప్రయత్నిస్తున్నది. 2023, డిసెంబరులో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కాళేశ్వరంపై దాడికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్నివిధాలా రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి తోడ్పాటును అందిస్తూనే ఉన్నదనేది బహిరంగ రహస్యం.

## కాంగ్రెస్ కక్ష సాధింపు చర్యలకు పరాకాష్ట

- ఏం నేరం చేశారని కేసీఆర్‌ను వేధిస్తున్నారు?
- మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆగ్రహం



హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ విచారణ పేరిట నోటీసులు జారీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న కక్ష సాధింపు చర్యలకు పరాకాష్ట అని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో కేసీఆర్‌కు వచ్చిన పేరు ప్రతిష్ఠలను చూసి ఓర్వలేకనే ప్రభుత్వం విషం కక్కుతున్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ జిత్తుల మారి రాజకీయం చూసి, గోబెల్స్ కూడా సిగ్గుపడుతాడని ఎద్దేవా చేశారు. 'అసలు ఏం నేరం చేశారని కేసీఆర్‌ను వేధిస్తున్నారు? ప్రాణాలు పణంగా పెట్టి తెలంగాణను సాధించినందుకా? కాళేశ్వరం ప్రాజెక్టును కట్టి.. కోటి ఎకరాలకు సాగునీరు ఇచ్చినందుకా? రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్తుతో రైతును రాజును చేసినందుకా? మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ మంచినీళ్లిచ్చినందుకా?' అంటూ జీవన్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు.

## కేసీఆర్‌పై కక్షతోనే నోటీసులు

- ఆయన సంకల్పానికి కాళేశ్వరమే నిదర్శనం
- కాళేశ్వరం కమిషన్ కాదు, కాంగ్రెస్ కమిషన్
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్ మే 20 (నమస్తే తెలంగాణ)/కంఠేశ్వర్: కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర, రాజకీయ కక్షతోనే కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇచ్చిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్ర పాలనలో గోదావరి జలాల్లో తెలంగాణ వాటా దక్కకపోవడంతో మన రైతాంగం పడ్డ గోసను చూసి కేసీఆర్ ఎంతగానో బాధపడ్డారని చెప్పారు. ఈ పరిస్థితుల్లో తెలంగాణను కోటి ఎకరాల మాగాణంగా తీర్చిదిద్దే సంకల్పంతో కేసీఆర్ కాళేశ్వరం బృహత్తర ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేశారని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుపై కాంగ్రెస్ నాయకులు మొదటినుంచీ కడుపుమంటతో ఈర్ష్య పడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రైతులు, పేదలు బాగుపడటం ఆ పార్టీకి ఇష్టముండదని దుయ్యబట్టారు. ప్రజలు ఎప్పటికీ పేదరికంలో ఉంటేనే తమకు పదవులు వస్తాయనే భావనతో కాంగ్రెస్ నాయకులు ఉంటారని విమర్శించారు. తెలంగాణలోని బీడు భూములకు గోదావరి జలాలతో తడిపే లక్ష్యంతో కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరంపై కాంగ్రెస్ నేతలు మొదటినుంచీ కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు కాళేశ్వరంలో భాగమైన మేడిగడ్డ బరాజ్‌కు పగుళ్లు రావడం, వెనువెంటనే కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్‌డీఎస్ఏ రంగంలోకి దిగడం, పడవలో చేరుకొని ఫొటోలు తీయడం, వీటిని అడ్డంపెట్టుకొని కాంగ్రెస్ నాయకులు దుష్ప్రచారం చేయడం జరిగిందని గుర్తుచేశారు. ఆ కుట్రల కొనసాగింపులో భాగంగానే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కాళేశ్వరం కమిషన్‌ను ఏర్పాటు చేసిందని చెప్పారు. తెలంగాణను అద్భుతంగా తీర్చిదిద్దేందుకు తన జీవితాన్ని పణంగా పెట్టిన కేసీఆర్‌పై కుట్రతోనే నోటీసులు జారీ చేశారని పేర్కొన్నారు. తెలంగాణ కోసం ప్రాణాలను తృణప్రాయంగా భావించి ఆమరణ దీక్షకు దిగిన మహానేత గౌరవాన్ని తగ్గించేందుకే కుట్ర కోణంలోనే ఈ కమిషన్‌ను ఏర్పాటుచేసిందని ఆరోపించారు. రాజకీయ కక్షతో వేసిన ఇలాంటి కమిషన్లు కాలక్రమంలో తప్పకుండా న్యాయాన్నే గెలిపిస్తాయనే విశ్వాసం వ్యక్తంచేశారు. త్వరలోనే నిజానిజాలు బయటకు వస్తాయని, పాలేవో, నీళ్లేవో ప్రజలకు స్పష్టత వస్తుందని వ్యాఖ్యానించారు.



## కాంగ్రెస్ రాజకీయ కమిషన్ నోటీసులు

- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్ మే 20 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం కమిషన్ కేసీఆర్‌కు ఇచ్చిన నోటీసులను కాంగ్రెస్ రాజకీయ కమిషన్ నోటీసులుగా పరిగణిస్తున్నామని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. కక్ష సాధింపు కోసమే కాంగ్రెస్ ఇలాంటి దుర్మార్గపు పనులను ఒడిగడుతున్నదని మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. నిద్రాహారాలు మాని తెలంగాణ ప్రజల సాగు, తాగు నీటి గోస తీర్చేందుకే ఈ బృహత్తర ఎత్తిపోతల పథకానికి అంకురార్పణ చేశారని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ కోటి ఎకరాల మాగాణిగా మారి పచ్చని పంటలతో విరాజిల్లిందని తెలిపారు. పాలన చేతగాక, పథకాలు అమలు చేయలేక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల దృష్టిని మరల్చేందుకే నోటీసుల పేరిట నాటకమాడుతున్నారని విమర్శించారు. కేసీఆర్‌పై కుట్రలను తెలంగాణ సమాజం నమ్మదని చెప్పారు. సూర్యుడిపై ఉమ్మివేస్తే అది తమ మీదే పడుతుందనే విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గుర్తుంచుకోవాలని హితవు పలికారు.



## రాజకీయ కుట్రలో భాగమే: పల్లె రవి



హైదరాబాద్ మే 20 (నమస్తే తెలంగాణ): రాజకీయ కుట్రలో భాగంగానే కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేసిందని కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నేత పల్లె రవికుమార్‌గౌడ్ ఆరోపించారు. స్వరాష్ట్ర కలను సాకారం చేసిన తెలంగాణ యోధుడిని విచారణ పేరిట ఇబ్బందులు పెట్టడం తగదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్, మంత్రులు కేసీఆర్‌పై కుట్రలు, కుతంత్రాలు పక్కనబెట్టి ప్రజలకిచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజలే కాంగ్రెస్‌ను అధఃపాతాళానికి తొక్కడం ఖాయమని హెచ్చరించారు.

## లోకం పోకడ




అవి ప్రభుత్వం కొన్న మా ధాన్యం కాదు.. ఇసుక దందా!

## ఎండా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 40.4°c | 26.6°c |
| నిజామాబాద్ | 39.1°c | 27.1°c |
| రంగారెడ్డి | 37.5°c | 23.8°c |
| కరీంనగర్ | 37.0°c | 27.0°c |
| వరంగల్ | 37.0°c | 25.0°c |
| నల్లగొండ | 37.5°c | 23.6°c |
| మెదక్ | 36.9°c | 25.0°c |
| ఖమ్మం | 35.0°c | 25.0°c |
| హైదరాబాద్ | 35.7°c | 27.1°c |
| మహబూబ్‌నగర్ | 34.0°c | 25.0°c |


## కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు

- జూన్ 5న విచారణకు హాజరు కావాలని ఆదేశం
- హరీశ్, ఈటల రాజేందర్‌కు సైతం నోటీసులు

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేసింది. జూన్ 5న విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నది. అదేవిధంగా మాజీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్‌కు సైతం నోటీసులు జారీచేసింది. జూన్ 6న హరీశ్‌రావు, 9న ఈటల రాజేందర్ విచారణకు హాజరుకావాలని కోరింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణ లోపాలపై విచారణ కోసం జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో కాళేశ్వరం కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. ఆ కమిషన్ ఇప్పటికే ఇరిగేషన్ శాఖ ఇంజినీర్లతోపాటు డిజైనింగ్, డీపీఆర్, నిర్మాణ సంస్థల ప్రతినిధులను విచారించింది. కాగ్, విజిలెన్స్, ఎన్‌డీఎస్ఏ నివేదికను సైతం కమిషన్ అధ్యయనం చేసింది. ఈ క్రమంలో అధికారులు, ఆయా సంస్థలన్నీ గత ప్రభుత్వ పాలసీకి అనుగుణంగా ప్రాజెక్టు పనులు చేపట్టినట్టు వెల్లడించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఇరిగేషన్ శాఖ మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు, ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేసిన ఈటల రాజేందర్‌ను సైతం విచారణకు పిలవాలని కమిషన్ నిర్ణయించినట్టు తెలుస్తున్నది.

### కేసీఆర్‌పై కాంగ్రెస్ కుట్ర

- మండలిలో ప్రతిపక్షనేత మధుసూదనాచారి



హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం కమిషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌పై కుట్రలకు తెరలేపిందని శాసన మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి విమర్శించారు. పరిపాలనా వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నదని దుయ్యబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణను కేసీఆర్ సస్యశ్యామలం చేశారని, రైతుల సాగునీటి ఘోస తీర్చేందుకు భగీరథుడిలా కంకణం కట్టుకున్నారని చెప్పారు. తెలంగాణను ధాన్యాగారంగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. తెలంగాణకు ఏం అన్యాయం చేశారని కేసీఆర్‌కు నోటీసులు ఇస్తారని ప్రశ్నించారు. వీటిని ముమ్మాటికీ కాంగ్రెస్ కక్ష సాధింపు నోటీసులుగానే పరిగణిస్తామని పేర్కొన్నారు. విచారణ పేరుతో కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తే.. తెలంగాణ మరొకసారి మర్లబడతదని హెచ్చరించారు.

### కేసీఆర్ గుర్తులు చెరపలేకనే నోటీసులు

- తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడె రాజీవ్‌సాగర్



హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా, ఇంకా ప్రజలు కేసీఆర్ పాలననే గుర్తు చేసుకుంటున్నారని, దీనిని ఓర్వలేకనే సీఎం రేవంత్‌రెడ్డి విచారణ పేరుతో కేసీఆర్‌కు నోటీసులు ఇస్తున్నారని తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడె రాజీవ్‌సాగర్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను కప్పి పుచ్చేందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. రాజకీయ దురుద్దేశంతో కాళేశ్వరం కమిషన్ పేరుతో కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని విమర్శించారు.

### కేసీఆర్ పేరు ప్రఖ్యాతులు తగ్గించలేరు

- బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం కమిషన్ పేరుతో కేసీఆర్ పేరు ప్రఖ్యాతులను దిగజార్చలేరని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర పేర్కొన్నారు. కేసీఆర్‌పై ఎవరు ఎలాంటి ఆరోపణలు చేసినా.. సూర్యునిపై ఉమ్మి వేయాలని అనుకోవడమే అవుతుందని దుయ్యబట్టారు.